క్లుప్తంగా

అర్బన్ తహసీల్దార్‌గా చల్లన్‌దొర



తహసీల్దార్ చల్లన్‌దొరను అభినందిస్తున్న సిబ్బంది

కాకినాడ సిటీ: కాకినాడ అర్బన్ తహసీల్దార్‌గా కె.చల్లన్‌దొర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సీతాపతిరావు ఇప్పటి వరకూ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా చల్లన్‌దొర పనిచేస్తూ బదిలీపై కాకినాడ అర్బన్ తహసీల్దార్‌గా వచ్చారు. ఆయన్ని కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బాలాత్రిపుర సుందరికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరి

బోట్‌క్లబ్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం కాకినాడ సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పాలతో పూజ నిర్వహించారు. గులాబీ, చామంతితో పాటు వివిధ రకాల పుష్పాలతో ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు చేశారు. కంచర్ల సత్తిరాజు, రజని, శేషారావు, మాధవి, సత్య గున్న రత్నం పుష్పాలు సమర్పించారు.

ప్రతిభను చాటే వేదిక 'ఆడుదాం- ఆంధ్రా'



విజేత క్రికెట్ జట్టుకు ప్రశంసాపత్రం, క్రీడా సామగ్రి అందజేస్తున్న నాయకులు, అధికారులు

కరప: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం- ఆంధ్రా' కార్యక్రమం గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను చాటే వేదికగా నిలుస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'ఆడుదాం- ఆంధ్రా' మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయికి ఎంపికైనా జట్లకు క్రీడా సామగ్రిని, ప్రశంసా పత్రాలను వారు అందజేశారు. ఎంపీడీఓ కె.అప్పారావు మాట్లాడుతూ పట్టుదలతో సాధన చేస్తే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. క్రికెట్ పురుషుల విభాగంలో పెద్దాపురప్పాడు, మహిళల విభాగంలో కరప-1 విన్నర్‌గా నిలిచాయన్నారు. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో వేళంగి-1, మహిళల విభాగంలో యండమూరు, కబడ్డీలో అరట్లకట్ట, నడకుదురు-2, ఖోఖోలో గురజనాపల్లి, కరప-1, వాలీబాల్‌లో నడకుదురు-2, గురజనాపల్లి సచివాలయాల జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. వీరికి స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, మద్దూరి భాస్కర్, పైలా గోవిందు, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏపీఓ ఈ.వెంకటరమణ పాల్గొన్నారు.

చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత



చిత్తడి నేలల సంరక్షణపై గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

కాకినాడ సిటీ: చిత్తడి నేలల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీ సంరక్షణ అధికారి ఎస్.భరణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్‌కోర్, పాఠశాల విద్యాశాఖ, అటవీ శాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల సంరక్షణ అవగాహనలో భాగంగా సోమవారం స్థానిక గాంధీనగర్ శాఖా గ్రంథాలయం (వివేకానంద పార్కు) వద్ద జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 23 పాఠశాలల నుంచి 114 మంది విద్యార్థులు హాజరయ్యారు. చిత్తడి నేలలు, వాటి సంరక్షణపై చక్కని చిత్రాలను విద్యార్థులు గీశారు. దీనికి ముఖ్య అతిథిగా జిల్లా అటవీ సంరక్షణ అధికారి భరణి హాజరై మాట్లాడుతూ చిత్తడి నేలలు, మడ అడవులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మడ అడవులను రక్షించాలని డీఎఫ్‌ఓ అన్నారు. జీవ వైవిధ్యం పరిరక్షణకు అంతా కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయ కర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిత్తడి నేలల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శాఖా గ్రంథాలయ అధికారి ఎం.శ్రీనివాసరావు, అటవీ క్షేత్రాధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా సమన్వయకర్త కేవీకే మహేశ్వరరావు, చిన్నబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లెక్క తేలింది

- సిటీ నియోజకవర్గంలో 2,36,437 మంది ఓటర్లు
- ఇందులో మహిళలే అధికం
- తుది జాబితా విడుదల

కాకినాడ: ఓటర్ల లెక్కల తేలింది.. తుది జాబితా విడుదలైంది.. వచ్చే ఎన్నికలను పురస్కరించుకుని అధికారులు ఓటర్ల జాబితాను విడుదల చేశారు. కాకినాడ సిటీ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య 2,36,437గా తేల్చారు. ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ-2024లో అభ్యంతరాల స్వీకరణ, నూతన ఓటర్ల నమోదు, ముసాయిదా జాబితాలో అభ్యంతరాల పరిష్కారం అనంతరం సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సోమవారం ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ జాబితాను విడుదల చేశారు. తుది జాబితా ప్రకటన అనంతరం నియోజకవర్గంలో మొత్తం 233 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పురుషులు 1,13,177 మంది, మహిళలు 1,23,166, ట్రాన్స్‌జెండర్లు 94 మంది వెరసి మొత్తం 2,36,433 మంది ఓటర్లుగా తేల్చారు. వాస్తవానికి గత ఏడాది అక్టోబర్ 27కి ముసాయిదా జాబితాలో 2,49,297 మంది ఓటర్లను గుర్తించారు. ఇందులో మరణించిన ఓటర్లు, ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలి వెళ్లిన, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారిని గుర్తించి మొత్తం 27,773 ఓట్లను తొలగించారు. ఫారం-6 ద్వారా 14,913 కొత్తగా నమోదైన వారికి ఓటు కల్పించారు. ఓటర్ల జాబితాలో 7,807 ఓట్లకు సంబంధించి మార్పులు, చేర్పులు చేశారు. ఇవన్నీ పూర్తి చేశాక 2,36,437 ఓట్లు ఉన్నట్టు తేల్చారు. కాగా 18 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన యువ ఓటర్లు కూడా అధికంగానే నమోదయ్యారు. ముసాయిదా జాబితా విడుదల చేసిన నాటికి 1,427 మంది ఉన్న ఓటర్లు తుది జాబితా ప్రకటించే సమయానికి 3,614కి పెరిగారు. ఒకే డోర్ నంబర్‌తో పదికన్నా ఎక్కువ ఓట్లు ఉన్న 655 నివాసాలను గుర్తించి సవరించారు. ఓటర్ల ముసాయిదా జాబితా విడుదలైన దగ్గర నుంచి ఇప్పటి వరకూ 14 సార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఆయా పార్టీల నేతల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని తుది జాబితాకు రూపకల్పన చేశారు.

233 పోలింగ్ కేంద్రాలు

ఓటర్ల తుది జాబితాను సిటీ నియోజకవర్గ పరిధిలోని 233 పోలింగ్ స్టేషన్లతోపాటు తహసీల్దార్, కార్పొరేషన్, ఏఈఆర్వో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఫర్నీచర్, విద్యుత్, మరుగుదొడ్లు, మంచినీరు వంటి అన్ని ఇతర సదుపాయాలు అవసరమైన మేరకు ఉన్నట్టు నిర్ధారించారు.



రూరల్‌లో 2,61,186 మంది ఓటర్లు

కాకినాడ సిటీ: రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాను ఆ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఇట్ల కిశోర్ విడుదల చేశారు. ఆ నియోజకవర్గంలోని 264 పోలింగ్ స్టేషన్లలో 2,61,186 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,29,684 మంది పురుషులు, 1,31,591 మంది మహిళలు, 11 మంది ఇతరులు ఉన్నారన్నారు. గత ఏడాది అక్టోబర్ 27న ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకటన నుంచి తుది ప్రచురణ వరకూ 13,767 మంది కొత్తగా చేరారన్నారు. ఈ రివిజన్ కాలంలో 18-19 ఏళ్ల మధ్యవారు 2,413 మందిని ఓటర్లుగా నమోదు చేశారన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు రావూరి వెంకటేశ్వరరావు, టి.నాగేశ్వరరావు, గదుల సాయిబాబా, ఎస్.అప్పారావు, కె.విజయరామయ్య, రమణమూర్తి, రూరల్ తహసీల్దార్ మురార్జీ, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరిస్తాం..



ఓటర్ల తుది జాబితాను ప్రచురించినప్పటికీ కొత్త ఓట్ల నమోదు, ఇతర ప్రక్రియలకు వచ్చే దరఖాస్తులను స్వీకరిస్తాం. నామినేషన్లు వేసే పది రోజుల ముందు వరకూ ఓటర్ల అభ్యంతరాలకు ప్రాధాన్యం ఇస్తాం. అప్పటి వరకూ కొత్త ఓట్లు నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శక ఓటర్ల జాబితాను సిద్ధం చేశాం.

-సీహెచ్ నాగ నరసింహారావు, ఈఆర్వో, కాకినాడ సిటీ

ప్రతి సమస్యకూ పరిష్కారం



స్పందనలో అర్జీదారుతో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: స్పందన ద్వారా ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'జగనన్నకు చెబుదాం'లో భాగంగా సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ సమస్యలపై 13 మంది వినతులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990కు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కాకినాడ రూరల్: స్థానిక 33/11 కేవీ శశికాంత్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.ప్రసాద్, ఏఈ గౌతు రాజు తెలిపారు. ఆర్టీఓ ఆఫీస్ ఫీడర్ పరిధిలో జవహర్ అపార్ట్‌మెంట్, తోట సుబ్బారావునగర్ ఏరియాలు, విద్యానగర్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ, స్టేడియం ప్రాంతాలు, డీసీసీబీ బ్యాంక్ వీధి, దొర అపార్ట్‌మెంట్ ప్రాంతాలకు సరఫరా ఉండన్నారు.

డీఎల్‌పీఓ విచారణ

కాకినాడ రూరల్: వలసపాకల పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం డీఎల్‌పీఓ అన్నామణి విచారణ చేశారు. ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అభియోగం ఎదుర్కొంటున్న పంచాయతీ కార్యదర్శి అహ్మద్ ఉన్నీషా బీబీని విచారించారు. ఇంటి పన్నుకు సంబంధించిన పాలిక పద్మావతికి రశీదు అందించామని, కావాలనే ఆమె తరఫున గ్రామానికి చెందిన వ్యక్తి కక్ష సాధింపులకు పాల్పడుతూ తప్పుడు ఫిర్యాదు చేశారని బీబీ అన్నారు. సదరు వ్యక్తి కుటుంబీకులు పంచాయతీ స్థలంలో ఇల్లు నిర్మించుకోవడంతో ఇంటి పన్ను వేయలేదనే ఈ విధంగా చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రెడ్డి నాయుడు, గుత్తుల రామకృష్ణ తదితరులు విచారణాధికారి డీఎల్‌పీఓ అన్నామణిని కలసి పంచాయతీ కార్యదర్శిపై ఉద్దేశపూర్వకంగా సదరు వ్యక్తి తప్పుడు ఫిర్యాదు చేశారని అన్నారు. గతంలో ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు పంచాయతీ సామాజిక స్థలంలో ఇల్లు కట్టుకోవడంతో సర్వే కోరామన్నారు. కావాలనే పంచాయతీ కార్యదర్శిని ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- నగరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. నాలుగున్నరేళ్లలో స్థానిక 26వ డివిజన్‌లో రూ.33 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. స్థానిక 26వ డివిజన్ పరదేశమ్మపేటలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. పథకాల లబ్ధిదారుల వివరాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం అర్హతను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే పింఛన్లను అందించడంతోపాటు మరెన్నో సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న సీఎం జగన్‌ను ఎన్నికల్లో ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో చంద్రబాబు, పవన్‌బాబు, కొండబాబు వంటి నేతలు ప్రజలను మభ్యపెట్టి మోసగించేందుకు వస్తారని, అటువంటి వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. మాజీ కార్పొరేటర్ సంగాని నందం, నాయకులు కొప్పనాతి బాబీ, పొన్నమండ కామేశ్వరరావు, పాలెపు సుబ్రహ్మణ్యం, సంగాని శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

కాకినాడ సిటీ: గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తూరంగి వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. సోమవారం తూరంగి-2 సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం-2 పరిధిలో రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో రూ.25 కోట్లతో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన బోర్డును అధికారులు ప్రదర్శించారు. ఈఓపీఆర్డీ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి బాబులు, నరాల నాగేశ్వరరావు, రొంగల వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కచేరీ

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి నృత్యోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో నాలుగో రోజు పండిట్ మొహిసిన్ సితార్, అరణ్యకుమార్ ఎస్రాజ్ వాయిద్యాలతో కచేరీ అద్భుతంగా జరిగింది. వీరికి తబలాపై ఉస్తాద్ నజ్ముద్దీన్ జావెద్ చక్కటి సహకారాన్ని అందించారు. తొలుత కార్యక్రమాన్ని ద్విభాష్యం నగేశ్ బాబు, సుభాషిణి ప్రారంభించారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కాకినాడ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించామని సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఏఈ ఆర్వోలు, బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది, ఇతర ఉద్యోగుల సహకారంతో ప్రక్రియను సజావుగా పూర్తి చేయగలిగామన్నారు. కార్యక్రమంలో రావూరి వెంకటేశ్వరరావు(వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.

సర్వం... రామమయం

- అయోధ్యలో రామ మందిరం ప్రారంభం వేళ వేడుకలు
- మార్మోగిన స్వామినామం



శ్రీపీఠంలో శ్రీరాముల కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం చేస్తున్న పరిపూర్ణానంద స్వామి



రమణయ్యపేట పద్మానగర్‌లో మహిళల నగర సంకీర్తన



అరట్లకట్టలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవేణి

కాకినాడ రూరల్: కోట్లాది మంది భారతీయుల స్వప్నం.. అయోధ్యలోని రామ మందిరం.. ఆ కల సాకారం అవుతున్న వేళ రామ భక్తుల మది పులకించింది.. పావనరామ.. సుగుణాభిరామ అంటూ ఆ స్వామివారిని భక్తజనం కొలిచింది. సోమవారం అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి మందిరం ప్రారంభం, బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాకినాడ నగర, రూరల్ నియోజకవర్గాల్లో ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించారు. శ్రీరామ నామ స్మరణతో భక్తిని నింపుకొని భక్తజనం ముందుకు కదిలారు. కాకినాడ రూరల్‌లోని ఊరూవాడా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామాల్లో రామాలయాలతో పాటు మిగిలిన దేవతామూర్తుల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీరామ.. జయ జయ రామా అంటూ భక్తులు నినదించారు. ఉదయమే రామ భక్తులు గ్రామాల్లో వీధి వీధిన నగర సంకీర్తనలు, సీతారాములకు పల్లకీ సేవ నిర్వహించారు.

కరప: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని అరట్లకట్టలో ఏర్పాటైన రక్తదాన శిబిరాన్ని సర్పంచ్ గోపి సత్యవేణి ప్రారంభించారు. 60 మంది శ్రీరామ భక్తులు రక్తదానం చేశారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, సిబ్బందితో కలసి దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, శ్రీరామ భక్తులు వెలుబంట్ల శ్రీనివాస్, యరమాటి సతీష్, బత్తుల సతీష్ గంటా వీరబాబు, వి.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

నగరం.. ఆధ్యాత్మిక సాగరం

బోట్‌క్లబ్: అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడలో వాడవాడలా రామ నామం మార్మోగింది. ప్రతి ఇంటా శ్రీరామ, హనుమంతుని జెండాలు రెపరెపలాడాయి. విశ్వహిందూ పరిషత్‌తో పాటు పలు ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో రామాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పైడావారి వీధిలోని బీజేపీ సీనియర్ నాయకుడు పైడా కృష్ణమోహన్ ఇంటి వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌పై అయోధ్యలో జరిగిన శ్రీరామ మందిర ప్రారంభ ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారం తిలకించారు. ఈ ప్రాంగణం వద్ద శ్రీరామ పట్టాభిషేక చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షతలు, రామాలయ చిత్రపటాలను భక్తులకు అందజేశారు. ప్రధాని మోదీ రామ మందిరాన్ని ఆవిష్కరించే సమయంలో భారీఎత్తున బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ హిందువుల కలను మోదీ సాకారం చేసి వారి హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించారన్నారు. ముత్తా నవీన్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు, మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, బీజేపీ నాయకులు పైడా భవానీప్రసాద్, రంబాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఏటిమొగ, పర్లోవపేట, సంజయ్‌నగర్, కొండయ్యపాలెం, పైడావారి వీధి, డాల్ఫిన్స్ కాలనీ, గాంధీనగర్‌లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. స్థానిక వినుకొండవారి వీధిలోని రాముని ఆలయంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. శ్రీరామ, ఓం, స్వస్తిక్ నామాలకు దీపాలంకరణ చేశారు.

శ్రీరాములోరి కల్యాణం.. భాగ్యం

కాకినాడ రూరల్: అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం, బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుని రమణయ్యపేట శ్రీపీఠంలో పరిపూర్ణానంద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఐశ్వర్యాంబికా సమేత సుందరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీరాముల వారి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం, పుష్పాభిషేకం, దీపాలంకరణ సేవ జరిపారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో రాత్రి సీతారాములు కల్యాణోత్సవం, దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇంటి నందిబాబు, ఆకుల రాజబాబు, వేణుమాణిక్యాలరావు పాల్గొన్నారు.

కరప: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండలంలో వేడుకలు నిర్వహించారు. నడకుదురు ఓసీ వీధి రామాలయంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పబ్బినీడి చక్రరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులతో కలసి శోభాయాత్ర చేశారు. కర సేవకులను ఘనంగా సత్కరించారు. రాత్రి రామాలయం వద్ద దీపాలు వెలిగించారు. శ్రీరామచంద్ర బాల వికాస కేంద్రం విద్యార్థులు దేవతామూర్తుల వేషధారణలో అలరించాయి. సమరసత సేవా ఫౌండేషన్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, కాకినాడ సత్యశావాహిని కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో అరట్లకట్టలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు పాల్గొన్నారు. నడకుదురు ఎస్సీ వీధి రామాలయంలో అర్చకుడు కాలకురస వెంకటరమణను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, గుండు విశ్వనాథం, వెలుగుబంట్ల శ్రీనివాస్, యరమాటి సతీష్, హిందూ పరిషత్ కార్యకర్త తడాల సత్తిబాబు, మండల బీజేపీ అధ్యక్షుడురమణేశ్వర్ పాల్గొన్నారు.



రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో సీతారాముల కల్యాణోత్సవం, దీపోత్సవం



కాకినాడలో సీతారామ ఉత్సవమూర్తులతో ఊరేగింపు



వినుకొండవారి వీధిలో దీపాలంకరణ



కరపలో సీతారాముల విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అభివృద్ధి పనులకు భూమిపూజ

కరప: కరప, వేములవాడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు భూమిపూజ చేశారు. కరపలో రూ.12.50 లక్షలతో ఐదు చోట్ల సీసీ రోడ్లకు, వేములవాడ శివారు గ్రామం సిరిగల పల్లిలంకలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.30 లక్షలతో పైపులైన్ పనులకు వారు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల అవసరాలకు అనుగుణంగా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధులు మంజూరు చేశారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి, వైఎస్సార్ సీపీ నాయకుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మేడిశెట్టి సత్తిబాబు, పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, నక్కా సత్తిబాబు, నక్కా సాంబయ్య పాల్గొన్నారు.

'నన్నయ' విద్యార్థి ప్రతిభ



జయదీప్‌ను అభినందిస్తున్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ

కాకినాడ రూరల్: తిమ్మాపురం పంచాయతీ అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగ విద్యార్థి రేవు బాల జయదీప్ జాతీయ స్థాయిలో యూజీసీ సెట్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ సాధించాడు. ఈ సందర్భంగా పీజీ సెంటర్‌లో జయదీప్‌ను ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ, కోర్సు కో ఆర్డినేటర్ కె.జోసెఫ్ స్టీఫెన్, విభాగ సహాయ ఆచార్యులు ఎం.నానిబాబు, హరిబాబు, గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వరహాలు తదితరులు అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. సివిల్స్ సాధించడమే లక్ష్యమని విద్యార్థి జయదీప్ తెలిపారు. జయదీప్ తండ్రి నారాయణస్వామి రంగరాయ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకే పథకాలు



వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న పీయూష్‌కుమార్, చిత్రంలో జేసీ ఇలక్కియ

కాకినాడ: పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకే ప్రధాని మోదీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కేంద్ర ప్రభుత్వ కామర్స్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి పీయూష్‌కుమార్ అన్నారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు సోమవారం ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్పయాత్రను ఆయన ప్రారంభించారు. జేసీ ఇలక్కియ, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, అధికారులు హాజరయ్యారు. కేంద్రం అమలు చేస్తోన్న ఆయుష్మాన్‌భారత్, ఉజ్వల యోజన, పీఎం స్వనిధి, ఆధార్ వంటి దాదాపు 15 పథకాలపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పీయూష్‌కుమార్ సందర్శించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులను సత్కరించారు. ప్రధాని మోదీ హయాంలో చేపట్టిన వివిధ పథకాలకు సంబంధించిన డాక్యుమెంటరీని అక్కడ ప్రదర్శించారు. అనంతరం పీయూష్‌కుమార్ మాట్లాడుతూ పౌష్టికాహారం నుంచి విద్య, ఉపాధి, వైద్యం, గృహ నిర్మాణం సహా అన్ని రంగాల్లో ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఎన్నో పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. జేసీ ఇలక్కియ మాట్లాడుతూ లబ్ధిదారులకు అవగాహన కల్పించి కేంద్ర పథకాల లబ్ధిని ప్రతి ఒక్కరికి అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. మెప్మా పీడీ ప్రియంవద, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రసాదరావు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, విద్యాశాఖ ఆర్జేడీ నాగమణి, నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి, బీజేపీ మేథావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ముత్తా నవీన్, బీజేపీ ప్రముఖులు వై.మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.